సాక్షి సంగారెడ్డి

మంగళవారం ၊ 28 ၊ నవంబర్ ၊ 2023



నిధులపై శ్వేతపత్రం ఇస్తారా..?

గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలకు నిధులెన్ని ఇచ్చారో.. దుబ్బాకకు ఏం చేశారో శ్వేత పత్రం ఇవ్వాలని రఘునందన్‌రావు కోరారు.

వివరాలు 6లో ►



ప్రజలే బలం, బలగం

కాంగ్రెస్ పార్టీకి బలం, బలగం ప్రజలేనని ఆ పార్టీ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వివరాలు 7లో ►



'గ్యారంటీ'లను నమ్మితే ఆగమే

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల హామీలను నమ్మి ఆగం కావొద్దని బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు.

వివరాలు 7లో ►

న్యూస్‌రీల్

నేడు జహీరాబాద్‌కు ప్రియాంకగాంధీ

జహీరాబాద్: కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ మంగళవారం ఉదయం 10 గంటలకు జహీరాబాద్‌కు రానున్నట్లు పార్టీ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని అతిథి హోటల్ వద్ద నుంచి రోడ్ షో ప్రారంభం అవుతుందన్నారు. పట్టణంలోని 65వ జాతీయ రహదారి గుండా కొనసాగి శ్రీనివాస్ థియేటర్ వద్ద కార్నర్ మీటింగ్‌తో ముగుస్తుందన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కాంగ్రెస్ విజయం తథ్యం

- పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాచయ్య



మాట్లాడుతున్న రాచయ్య

కోహీర్ (జహీరాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాచయ్య పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు విశ్వసించి పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ రైతుల ప్రయోజనం కోసం చెరుకు కర్మాగారాన్ని తెరిపిస్తామన్నారు. స్థానిక కర్మాగారాల్లో ఇక్కడి నిరుద్యోగులకు 80 శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సయ్యద్ రియాజొద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యులు అశ్రఫ్ అలీ, అజ్జుపటేల్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కాటాను గెలిపించండి


- కేరళ మాజీ హోంమంత్రి రమేశ్



రమేశ్‌తో కాటా శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రానుందని, పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా బరిలో ఉన్న కాట శ్రీనివాస్‌గౌడ్‌ను ప్రజలు అధిక మెజార్టీతో గెలిపించాలని కేరళ మాజీ హోంమంత్రి రమేశ్ ప్రజలకు పిలుపునిచ్చారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం, గుమ్మడిదల, దోమడుగు, బొంతపల్లి, కానుకుంట, అనంతారం, కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రానుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు మృతి



మోహన్, అంజయ్య మృతదేహాలు

కోహీర్(జహీరాబాద్): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని పైడిగుమ్మల్ గ్రామ శివారులో మైసమ్మ చెరువులో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పైడిగుమ్మల్ గ్రామానికి చెందిన చీమల మోహన్ (33), చీమల అంజయ్య (32) ఇద్దరూ అన్నాదమ్ముళ్ల పిల్లలు. ఇందులో మోహన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉండగా, ఆటో తోలుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అంజయ్యకు భార్య ఇద్దరు పిల్లలు ఉండగా, కూలీ పని చేసుకొంటూ జీవిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఇద్దరూ వికారాబాద్ జిల్లా మర్పల్లికి వెళ్తున్నామని ఇంట్లో చెప్పి వెళ్లారు. ఎంతసేపు అయినా తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల గాలించారు. అయినా ఫలితం లభించలేదు. సోమవారం ఉదయం పైడిమ్మల్ గ్రామ శివారులో మైసమ్మ చెరువు గట్టు మీద మోహన్ ఆటో కనిపించింది. చెరువు దగ్గర మద్యం బాటిళ్లు చెప్పులు ఉన్నారు. చెరువులో పడి ఉంటారని అనుమానంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాలు లభ్యమయ్యాయి. తాగిన మైకంలో ప్రమాదవశాత్తు జారిపడి ఉంటారని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.







సోమవారం జోగిపేట, సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలకు హాజరైన జనం, అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

నేను మెదక్ బిడ్డనే..

- త్వరలో ఐటీ హబ్, మెట్రో రైల్
- సంగమేశ్వర బసవేశ్వరతో సంగారెడ్డి జిల్లా సస్యశ్యామలం
- అందోల్‌లో ఒకేసారి దళితబంధు
- చింతా ప్రభాకర్, క్రాంతికిరణ్‌ను గెలిపించండి
- జోగిపేట, సంగారెడ్డి ప్రజాఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

సంగారెడ్డి /వట్‌పల్లి/జోగిపేట: '' సంగారెడ్డి నాది. నేను పాత మెదక్ జిల్లా బిడ్డనే. గత ఎన్నికల్లో చింతా ప్రభాకర్‌ను ఓడగొట్టారు. అయినా బాధ పడకుండా సంగారెడ్డి నాదనుకునే ఎక్కువ నిధులిచ్చిన'' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సోమవారం సంగారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. తెలంగాణ ద్రోహి, ఎస్పీ కారును గుద్దిన, రిగ్గింగ్ చేసిన జగ్గారెడ్డి సంగారెడ్డికి అవసరమా అని ప్రశ్నించారు. సౌమ్యుడు, ప్రజల మనిషిని చింతా ప్రభాకర్ ఎల్లవేళలా సంగారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటున్న సంగతి మరచిపోవద్దని ప్రజలను కోరారు. చింతా ప్రభాకర్ నా చుట్టూ తిరిగి సంగారెడ్డికి ఐటీ హబ్ , మెట్రో రైలు మంజూరు చేయాలని కోరారు. ఆయన కోరిక మేరకు సంగారెడ్డికి రెండో దశలో మెట్రో రైలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సంగారెడ్డికి మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ కాలేజీలు ఇచ్చాను. 450 పడకల ఆస్పత్రి తయారవుతుందన్నారు.

ఉద్యమ ద్రోహి జగ్గారెడ్డి..

''గత ఎన్నికల్లో సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన జగ్గారెడ్డి గతంలో బీఆర్ఎస్‌లోనే ఉండేవారు.. ఆయన తెలంగాణ ఉద్యమ ద్రోహి.. అమ్ముడు పోయిండు.. ఇటీవల సోషల్ మీడియాలో చూసిన.. ఎస్పీ ఆఫీస్ కారు గుద్దేసిన, ఓట్లు గుద్దుకున్న..బూత్‌లు క్యాప్చర్ చేసిన.. అంటున్నడు.. తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వనని కిరణ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో అంటే ఒక్క కాంగ్రెస్ నాయకులు రాజీనామా చేయలేదు. కాంగ్రెస్ తెలంగాణకు ఏం చేస్తుంది. ఇందిరమ్మ రాజ్యం సక్కదనం ఉంటే ఎన్టీఆర్ ఎందుకు పార్టీ పెట్టాల్సి వచ్చింది.. ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి రాజ్యమే ఉండేది.. ఎవరికి కావాలి ఇందిరమ్మ రాజ్యం..'' అని కేసీఆర్ ప్రశ్నించారు.

దామోదర ఏం చేశాడో చెప్పాలి

అందోల్‌లో దళితజాతి అనేక ఏళ్లుగా వెనుకబడింది కాబట్టి ఒకే విడతలో అందోల్ నియోజకవర్గానికి దళిత బంధు పథకాన్ని వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సోమవారం జోగిపేటలో ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఎలా ఉందో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సరైన వారికి వేస్తే అందోల్ భవిష్యత్ ఉంటుందని, కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో రైతుబంధు ఇవ్వడం చేతకాలేదు గానీ మేము ఇస్తుంటే పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజకీయం అంటున్నారని విమర్శించారు. ఉపముఖ్యమంత్రిగా పనిజేసిన దామోర రాజనర్సింహ అందోల్ నియోజకవర్గానికి ఏం చేశాడో చెప్పాలన్నారు. క్రాంతి కిరణ్ లోకల్ కాబట్టి ఇక్కడే మీతో కలిసి ఉంటున్నాడని, ఆయన్ను గెలిపించాలన్నారు. ఆయా సభల్లో మంత్రి హరీశ్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్, కో ఆర్డినేటర్ పట్నం మాణిక్యం, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, టీఎస్‌టీపీసీ చైర్మన్ భిక్షపతి, జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ, జెడ్పీ మాజీ చైర్మన్ బాలయ్య, ఏఎంసీ చైర్మన్ సంజీవయ్య, మాజీ చైర్మన్లు నారాయణ, జోగినాథ్, నాగభూషణం, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి కొరత ఉండదు : చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

మీరే నా బలం, బలగం అని, సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతోనే నేను ఇప్పుడు మీ ముందు ఉన్నానని బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. ఆశీర్వాదసభలో ఆయన మాట్లాడుతూ.. కాలం కలిసిరాకపోయినా కాల్వల ద్వారా పంటలు పండించుకునేలా సంగమేశ్వర బసవేశ్వర ఇరిగేషన్ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ మంజూరు చేశారని వాటి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో సంగారెడ్డికి తాగు, సాగు నీటి కొరత ఉండదన్నారు. సంగారెడ్డికి ఐటీ హబ్, మెట్రో రైల్ మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌ను విజ్ఞప్తి చేశామన్నారు. విద్యావంతులు, యువత మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు రావడం కోసం మెట్రో ఇవ్వాలని కోరామన్నారు.

ప్రతీ గ్రామానికి నిధులిచ్చా: క్రాంతికిరణ్



మాట్లాడుతున్న క్రాంతికిరణ్

తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రతీ గ్రామానికి రూ.50 లక్షలు కేటాయించానని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. జోగిపేటను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశామని, 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు మంజూరు, మునిపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఇచ్చినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ జిల్లాలోని అల్లాదుర్గం, టేక్మాల్, రేగోడ్, రాయికోడ్ మండలాలను సంగారెడ్డి జిల్లాలో కలపాలని, జోగిపేటను ఐటీ హబ్‌గా మార్చడంతోపాటు, పరిశ్రమలు, జోగిపేటలో మహిళా రెసిడెన్షిల్ డిగ్రీ కాలేజీ ఏర్పాటు, అందోల్‌లో దళితబంధును పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయాలని కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

ముస్లింలకు ప్రత్యేక కోటా

- 20 ఎకరాల్లో శ్మశానవాటిక, షాదీఖానా నిర్మిస్తాం
- లింగాయత్‌లు మాట ఇస్తే తప్పరు
- ఝరాసంగానికి జూ.కళాశాల మంజూరు
- ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి హరీశ్‌రావు

ఝరాసంగం/జహీరాబాద్/జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావును గెలిపిస్తే జహీరాబాద్ ముస్లింలకు స్పెషల్ కోటా కేటాయిస్తానని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. కర్నాటక రాష్ట్రంలో 90 లక్షల ముస్లిం జనాభా ఉండగా తక్కువ నిధుల కేటాయించారని, అదే తెలంగాణలో 50 లక్షల జనాభా ఉంటే కర్నాటక కంటే నిధులు డబుల్ కేటాయించామన్నారు. జహీరాబాద్‌లో ముస్లింల జనాభా అధికంగా ఉందన్నారు. వారి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తానన్నారు. మాణిక్‌రావును గెలిపిస్తే శ్మశానవాటికకు 20 ఎకరాలు కేటాయిస్తామని, కోహీర్‌లో షాదీఖానా, బస్టాండ్ నిర్మిస్తామన్నారు. అలాగే వీరశైవ లింగాయత్‌లు మాట ఇస్తే తప్పరని మంత్రి పేర్కొన్నారు. నియోజవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న లింగాయత్‌లు బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. నా మిత్రుడు ఎంపీ బీబీపాటిల్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్‌లు లింగాయతులని గుర్తు చేశారు. పట్టణంలో నిర్వహించిన మాలల ఆత్మీయ సమ్మేళనానికి హరీశ్‌రావు హాజరయ్యారు. సమావేశంలో ఎంపీ. బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, టీడీఐడీఎస్ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, ఎన్నికల ఇన్‌చార్జి దేవిప్రసాద్, లింగాయత్ సమాజ్ నాయకులు శంకర్‌పాటిల్, రాజశేఖర్ షెట్కార్, బీఆర్ఎస్ నాయకులు భూమయ్య, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ మంజూరు చేస్తాం..

సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తి చేసి రైతుల కాళ్లు కడిగి, లక్ష ఎకరాలకు నీళ్లందిస్తామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలానికి జూనియర్ కళాశాలను మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, ప్రజాప్రతినిధులు, నాయకులు జగదీశ్వర్, సంతోష్‌కుమార్ పాటిల్, పరమేశ్వర్ పాటిల్, విజేందర్‌రెడ్డి, హఫీజ్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో టెలికాన్ఫరెన్స్

నారాయణఖేడ్: మంత్రి టీ.హరీశ్‌రావు నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలువురు రైతులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక రైతుబంధును ఎకరాకు రూ.8వేలతో ప్రారంభించి రూ.10వేలకు పెంచుకోగా మళ్లీ గెలుపొందాక రూ.16వేలకు పెంచుకుందామని అన్నారు. ఖేడ్ నియోజకవర్గం కర్ణాటక సరిహద్దుల్లో ఉన్నందున అక్కడి పరిస్థితులు చూసి కళ్లు తెరవాలని అన్నారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరిక మేరకు శనగలు, జొన్న, పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఖేడ్‌లో మార్కెట్‌యార్డు, పెద్దశంకరంపేటలో సబ్‌మార్కెట్‌ను పూర్తిస్థాయి మార్కెట్‌గా మారుస్తామని అన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరకును చివరి గడ వరకు క్రషింగ్ జరిపిస్తాం

జహీరాబాద్: జహీరాబాద్ నియోజకవర్గంలోని రైతులతో మంత్రి టీ.హరీశ్‌రావు సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా చెరకు రైతుల విషయమై మాట్లాడారు. రైతులు ఏ మాత్రం ఆందోళన పడొద్దని, సాగులో ఉన్న ప్రతీ చెరకు గడను క్రషింగ్ జరిపించేలా బాధ్యత తీసుకుంటానన్నారు. అంతే కాకుండా రైతులకు ట్రైడెంట్ యాజమాన్యం బకాయి పడిన రూ.9 కోట్లను సైతం ఇప్పిస్తామన్నారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి సందేహాలు పడొద్దన్నారు.



జహీరాబాద్ లింగాయత్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్ కుట్రలతోనే రైతుబంధు నిలిపివేత

రైతులతో బీఆర్ఎస్ పార్టీకి ఉన్నది ఓటు బంధం కాదని పేగు బంధమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే రైతుబంధుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని, అదే విషయాన్ని తాను ఓ సభలో చెప్పానని, ఇందులో కొత్తగా ఏముందని చెప్పారు. కానీ కాంగ్రెస్ నేత నిరంజన్ రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో రైతు బంధను ఆపేశారని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసి ఆపినా.. డిసెంబర్ 3వ తేదీ తర్వాత వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, మరుసటి రోజే రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. తప్పిదారి కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లేనని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల నుంచి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, అభివృద్ధి కంటికి కనిపిస్తుందని చెప్పారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు. కర్నాటక ప్రజలు రాహుల్, ప్రియాంక గాంధీల మాటలను నమ్మి ఓటు వేసి మోసపోయారన్నారు.

ఆశీర్వదించండి సేవ చేస్తా..



- ఓడిపోయినా ఐదేళ్లు సేవ చేశా
- సంగారెడ్డికి రూ.4,500 కోట్ల నిధులు తెచ్చా
- పట్టణాల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వలు నిర్మించా
- ఈసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాం
- 'సాక్షి'తో చింతా ప్రభాకర్

సంగారెడ్డి : ''ఐదేళ్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసిన.. కరోనా వంటి ఆపత్కాలంలో కూడా చేతనైన సాయం చేసి నేనున్నానంటూ ప్రజలకు భరోసా కల్పించిన.. గత ఎన్నికల్లో అభ్యర్థుల గుర్తుల విషయంలో కొంత గందరగోళం ఏర్పడి స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైన.. కానీ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడం మరిచిపోలేదు. గెలిచిన వారు పత్తాలేకుండా పోయారు.. గెలిపించిన ప్రజలనూ పట్టించుకోలేదు.. కానీ నేను మాత్రం ఐదేళ్లు ప్రజలకు అందుబాటులోనే ఉన్న.. సామాన్యుడు పిలిచినా పలికేంత దగ్గరలో ఉండి సేవ చేసిన.. ఐదేళ్లు ప్రజలను పట్టించుకోకుండా పోయిన వారు ఇప్పుడు ఎన్నికలు రాగానే మళ్లీ వచ్చారు..'' అని సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డి పట్టణంలో ఓటర్లను కలిసిన సందర్భంగా చింత ప్రభాకర్ 'సాక్షి'తో మాట్లాడారు.

దీవిస్తారనే నమ్మకం ఉంది

మంత్రి హరీశ్‌రావు సహకారంతో సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాను. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించిన.. పదేళ్లలో ఏ నియోజకవర్గానికి రానంతగా సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం చెక్కులు సంగారెడ్డి నియోజకవర్గంలో లబ్ధిదారులకు పంపిణీ చేశాం. ఈసారి సంగారెడ్డి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నన్ను దీవిస్తారనే నమ్మకంతో ఉన్నాను. మంత్రి హరీశ్‌రావు చొరవతో సంగారెడ్డికి రూ.4,500 కోట్ల నిధులు తెచ్చి పలు అభివృద్ధి పనులు చేశాను. ఈ ఒక్కసారి తనను ఆశీర్వదించి గెలిపిస్తే సంగారెడ్డి మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

నియోజకవర్గం మేనిఫెస్టో..

''సంగారెడ్డి నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను ఇప్పటికే ప్రకటించాం. నియోజకవర్గం మేనిఫెస్టో 2023–28 పేరుతో 16 అంశాలకు సంబంధించి ఐదేళ్లలో చేపట్టనున్న అభివృద్ధి పనులను స్పష్టంగా పేర్కొన్నాం. ఈ మేనిఫెస్టోను ఇప్పటికే ప్రజల్లోకి తీసుకెళ్లాం. ఇచ్చిన ప్రతీ మాటకు కట్టుబడి ఉన్నాం. చెప్పిన ప్రతీ పని చేసి తీరుతాం. జగ్గారెడ్డి వీధికో ఏటీఎంలని, ఇళ్ల స్థలాలంటూ గత ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టి గెలిచారు. వారి వ్యవహార శైలిని ప్రజలు గమనించారు.. ఈసారి కూడా జిమ్మిక్కులు చేయాలని చూస్తున్నారు.. మరోసారి సంగారెడ్డి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు. కానీ సంగారెడ్డి ప్రజలు చైతన్యవంతులు ఈసారి ఈ జిమ్మిక్కులు నమ్మరు.

1,609 పోలింగ్ కేంద్రాలు

- కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో శాసనసభ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉందని ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం తెలిపారు. జిల్లాలో 910 ప్రాంతాల్లో మొత్తం 1,609 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. నవంబర్ 28 సాయంత్రం 5 గంటల నుంచి ప్రచార కార్యక్రమం నిషేధించామని, ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ జిల్లాలో ఉండకూడదని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్‌లు తనిఖీ చేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి లౌడ్ స్పీకర్ల వినియోగం, సమావేశాలు నిషేధించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా ఈ నెల 29, 30 తేదీల్లో ప్రింట్ మీడియాలో ఎలాంటి ప్రకటనలను ప్రచురించకూడదని తెలిపారు.

రూ.5.24 కోట్ల నగదు జప్తు

జిల్లాలో ఇప్పటి వరకు రూ.5.24 కోట్ల నగదు జప్తు చేశామని, ఆదాయపన్ను శాఖ ద్వారా రూ.19.48 కోట్లు జప్తు చేసినట్లు తెలిపారు. అదే విధంగా 2,67,863.55 లీటర్ల లిక్కర్, 659.58 కిలోల అక్రమ గంజాయిని జప్తు చేశామని పేర్కొన్నారు. 7.155 గ్రాముల బంగారం, 23,641 గ్రాముల వెండి, 1,395 చీరలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జప్తు చేసిన నగదు నుంచి జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా రూ.3.40 కోట్లు విడుదల చేశామని అన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శరత్

లక్ష దీపోత్సవం



మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో గల మల్లన్న స్వామి ఆలయ ఆవరణలో సోమవారం రాత్రి లక్ష దీపాలంకరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

– సదాశివపేట రూరల్ (సంగారెడ్డి):

క్లుప్తంగా

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ



మజీద్‌పల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

వర్గల్(గజ్వేల్): శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ భూటియా సూచించారు. సోమవారం ఆయన తొగుట సీఐ కమలాకర్, బేగంపేట ఎస్సై అరుణ్‌తో కలిసి మజీద్‌పల్లి, నెంటూరు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్ట్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం తగదన్నారు. ఎక్కడైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలిస్తే 8712667309 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఓటు హక్కు వజ్రాయుధం



హుస్నాబాద్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

హుస్నాబాద్: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సోమవారం పట్టణంలో ఎస్సై మహేష్ జార్ఖండ్ ఆర్మ్‌డ్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని, అసెంబ్లీ ఎన్నికల్లో తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉత్తమ నాయకుడికి ఓటు వేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు

సిద్దిపేటకమాన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. 30న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా తిరగవద్దని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమాలను తప్పకుండా పాటించాలని తెలిపారు.

ప్రలోభాలకు గురిచేయొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న వివేక్ కుమార్ సిన్హా

దుబ్బాక: మద్యం, నగదు, డబ్బులతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేక్ కుమార్ సిన్హా సూచించారు. సోమవారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో అభ్యర్థుల ఖర్చుల రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీం అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్, ఏఆర్ఓ వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

నిధులపై శ్వేతపత్రం ఇస్తారా..?

- చింతమడ్కలా దుబ్బాకలో ఇంటికి రూ.10 లక్షలు ఎందుకివ్వలే..
- బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాకలో మాట్లాడుతున్న మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: 'నేను పుట్టి పెరిగి విద్యాబుద్ధులు నేర్పిన గడ్డ దుబ్బాక అంటే చాలా ప్రేమ' అని చెప్పిన కేసీఆర్.. చింతమడ్క లాగా దుబ్బాకలో ఇంటికి రూ.10 లక్షలు ఎందుకివ్వలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. దుబ్బాక సభలో కేసీఆర్ ఈ ప్రాంతంపై కపట ప్రేమ ఒలకబోశారని..అంత ప్రేమ ఉన్నోడైతే సీఎం చదువుకున్న పాఠశాల భవనం, వేంకటేశ్వర ఆలయం ప్రారంభోత్సవాలకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేసీఆర్ అంటేనే అబద్ధాలని.. ఆయన చెప్పిన అబద్ధాల గురించి చెప్పాలంటే ఐదేళ్లు పడుతుందని విమర్శించారు.

తండ్రీకొడుకు, అల్లుడికి నా మీద అంత కోపమెందుకో?

దుబ్బాకకు వరుసపెట్టి తండ్రీకొడుకు, అల్లుడు వచ్చి తనను ఇష్టం వచ్చినట్లు తిడుతుండ్రు అని రఘునందన్‌రావు ఆరోపించారు. అసలు మీరు ఏం చేశారని దుబ్బాకకు వస్తున్నరో ప్రజలకు వివరించాలని అన్నారు. మీరు చేసిన అరాచకాలకు జనానికి విరక్తి వచ్చే దుబ్బాకలో రఘునందన్‌రావు ఎమ్మెల్యే అయ్యాడన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. దుబ్బాక సభలో ఉద్యమకారుడు, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన స్వర్గీయ రామలింగారెడ్డి పేరు తీయడానికి కేసీఆర్‌కు ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించారు.

దుబ్బాకకు ఎన్ని నిధులు ఇచ్చారు?

గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలకు నిధులెన్ని ఇచ్చారో.. దుబ్బాకకు ఏం చేశారో శ్వేత పత్రం ఇవ్వాలని కోరారు. 2016లో రామలింగారెడ్డి అడిగినప్పుడు దుబ్బాకకు రెవెన్యూ డివిజన్ ఎందుకివ్వలేదన్నారు. ఇప్పుడు ప్రభాకర్‌రెడ్డి గెలిస్తేనే ఇస్తారా.. ఇది ఎంత వరకు సమంజసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పుడు గెలిపిస్తే అభివృద్ధి చేస్తాం అనడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని చెప్పారు.

ఈగ వాలినా ఊరుకోను

దుబ్బాక మీద పరాయి పెత్తనం ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. దుబ్బాక ప్రజల మీద ఈగ వాలిన ఊరుకోనన్నారు. దుబ్బాకలో దళితులకు దళిత బంధు, బీసీలకు బీసీ బంధు, పేదలకు డబుల్ బెడ్రూంలు ఎందెకివ్వలేదో చెప్పాలన్నారు. దుబ్బాక ప్రజల ఆత్మగౌరవం మీద దెబ్బకొడితే నేను ఊరుకోనన్నారు. ప్రజల గుండెల్లో నిలిచిన రఘునందన్‌రావును తిడితే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, ఎస్ఎన్ చారి, విభీషణ్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులున్నారు.



బీజేపీలో చేరుతున్న సీనియర్ నాయకులు శేఖర్

అందరికోసం పనిచేస్తా

చేగుంట(తూప్రాన్): అభిమానంతో గెలిపిస్తే అందరికోసం పనిచేస్తానని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం పెద్దశివనూర్ గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అప్పాల శేఖర్‌తోపాటు 100 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దశివనూర్ గ్రామస్తులకు ఏ కష్టం వచ్చినా ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూమలింగంగౌడ్, వెంగళరావు, అంజాగౌడ్, నగేష్, శోభన్, నర్సింలు పాల్గొన్నారు.

హరీశ్.. దుబ్బాకకు ప్రథమ శత్రువు



మిరుదొడ్డిలో మాట్లాడుతున్న రఘునందన్ రావు

మిరుదొడ్డి(దుబ్బాక): అభివృద్ధిని అడ్డుకుంటున్న మంత్రి హరీశ్‌రావే దుబ్బాకకు ప్రథమ శత్రువని రఘునందన్‌రావు ఆరోపించారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుబ్బాక ఎమ్మెల్యేకు ఎక్కడ పేరొస్తదోనని హరీశ్ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకున్నాడన్నారు. దుబ్బాక అభివృద్ధిని కోసం హరీశ్, కేటీఆర్ చుట్టూ తిరిగి వినతులు సమర్పించినా బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తానంటున్న సీఎం కేసీఆర్ మాటలు నమ్మొద్దన్నారు. మిరుదొడ్డి మండలంలో అసైన్డ్ భూములను డ్రోన్ కెమెరాలతో ఎందుకు సర్వే చేయించారని ప్రశ్నించారు. డబ్బుల మూటలతో వచ్చిన వారికే బీఆర్ఎస్‌లో చోటు ఉందన్నారు. దుబ్బాక నియోజక వర్గంలో దళితబంధు, బీసీ బంధు ఇవ్వలేదని మండిపడ్డారు. బీజేపీ గెలిస్తే పింఛన్‌లు రావని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన బలం బలగం దుబ్బాక ప్రజలేనన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, వైన్స్ మాత్రం వెలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్కీంలు, ఊర్ల పేర్లు, మనుషులను గుర్తించలేని బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాత్రం తాగి తందనాలు ఆడడానికి మాత్రం పబ్బులు కావాలని అడుగుతున్నాడని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుళ్ళ మల్లేశం, మద్దెల రోశయ్య, మల్లన్న గారి భిక్షపతి, ఎల్ముల దేవరాజు పాల్గొన్నారు.

ఆదరిస్తే.. అభివృద్ధి షికారే..

దుబ్బాక: పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా సోమవారం 17వ వార్డులో కౌన్సిలర్ పులిగారి కల్పన బజ్జీలు వేసి ఓటర్లను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఆసిఫ్, రాజమౌళి, భూంరెడ్డి, అశోక్, ప్రశాంత్, వీణ తదితరులున్నారు.



తాతా.. కారును యాదుంచుకో

చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని ఆకునూరులో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోతి విజయ్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ఇంటి వద్ద కూర్చున్న పెద్దాయనకు కారు గుర్తును చూపి ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో దాసు, కనకయ్య తదితరులున్నారు.



బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రజల స్పందన చూస్తుంటే బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని, ఎక్కడ ప్రచారానికి వెళ్లినా పార్టీలో భారీగా చేరుతున్నారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కూచారంకు చెందిన అంబేడ్కర్ సంఘం సభ్యులు 100 మంది, ముప్పిరెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సతీశ్‌చారిలు గులాబీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పురం మహేశ్, విఠల్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, దాసరి నరేష్, పురం రవి, రమేష్‌గౌడ్, మాంగ్యా నాయక్, ఉదయ్‌రంజన్‌గౌడ్, వీరేష్‌గౌడ్ ఉన్నారు.

మత్స్యకారుల మద్దతు బీఆర్ఎస్ పార్టీకే..

గజ్వేల్‌రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పాండవుల చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలలో చేప పిల్లలను వదులుతూ మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల మత్స్యకార సంఘం సభ్యత్వం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని, గ్రామాల్లో ముదిరాజ్ భవనాల నిర్మాణం చేపట్టారన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత పనులు చేపట్టి... కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను నింపారన్నారు. గత ప్రభుత్వాలు ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించగా... తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. ఐదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 500 కోట్ల వ్యయంతో చేప పిల్లలను పంపిణీ చేయగా... ప్రతియేటా రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. చేపలను మార్కెటింగ్ చేసేందుకు ఫోర్, టూ వీలర్ వాహనాలను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కొంటమైన నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలి

- ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్

గజ్వేల్: 'రైతు బంధు' డబ్బులు రాకుండా అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌కు రైతుల్లో వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక ఆ రెండు పార్టీలు కుట్రలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. డిసెంబర్ 3 తర్వాత కేసీఆర్ మూడోసారి హ్యాట్రిక్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దీని తర్వాత ప్రభుత్వ పథకాల అమలుకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు క్రిష్ణాగౌడ్, ఎంపీటీసీ ఆంజనేయులు, కౌన్సిలర్ చందు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న దేవీ రవీందర్

రాముని బండలో కార్తీక పూజలు



పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం జంగంరెడ్డిపల్లిలోని రామునిబండ శ్రీకోదండ సీతా రామచంద్రస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలయంలోని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సర్పంచ్ దంపతులతో పాటు మరో పది జంటలు సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. మహిళలు దీపారాధన చేశారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, నరేష్, కుమార్, పావని, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు: చింతా



సోమవారం సంగారెడ్డిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, హరీశ్‌రావు, చింతా ప్రభాకర్

సంగారెడ్డి: జిల్లాలో సోమవారం నిర్వహించిన సీఎం ప్రజా ఆశీర్వాద సభలు సక్సెస్ అయ్యాయి. సభలతో సంగారెడ్డి, జోగిపేట పట్టణాలు గులాబీ మయమైయ్యాయి. సంగారెడ్డి సభలో సీఎం కేసీఆర్ పలు హామీలు ఇవ్వడంపై బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. మెట్రో రైలును సంగారెడ్డి వరకు విస్తరించడం, ఉపాధి ఉద్యోగం కోసం ఇక్కడ ఐటీ ఏర్పాటు, త్వరలో హైదరాబాద్‌కు వచ్చే పరిశ్రమలను సంగారెడ్డికే తరలిస్తామని చెప్పారు. ఈ హామీలతో సంగారెడ్డి జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చింతా మాట్లాడుతూ.. ఓడిన కరోనా సమయంలో ప్రజల మధ్యనే ఉన్నాను ఒక్కసారి ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా. గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓడిపోయినా ఐదేళ్లపాటు ప్రజల కోసం ప్రజల మధ్యనే ఉండి సేవ చేశానని కరోనా సమయంలో సైతం ప్రజలకు సేవలు చేద్దాం అనే ఉద్దేశ్యంతో గడిచిన ఈ నాలుగేళ్ల లో నియోజక వర్గానికి సీఎం కేసీఆర్ సహకారంతో, మంత్రి హరీశ్‌రావు చొరవతో నిధులు తెచ్చి పలు అభివృద్ధి పనులు చేశానన్నారు.

ప్రజలను వంచించడమే బీఆర్ఎస్ నైజం

- కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి



వరిగుంతంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

కొల్చారం(నర్సాపూర్): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను వంచించడమే నైజంగా పెట్టుకుందని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఆరోపించారు. సోమవారం రాత్రి మండలంలోని వరిగుంతం, సంగాయిపేట, చిన్నఘనాపూర్ గ్రామాల్లో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచార నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం మరోసారి రావాలంటే ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, గోవర్ధన్, శేఖర్, విజయ్ గౌడ్, శ్రీకాంత్, అరిగె కిష్టయ్య, ఉపేందర్, ఆగంగౌడ్, దర్శిరాజు, సుధీర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఓడిపోతామనే కేసీఆర్ కుట్రలు

- కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి



మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్: గజ్వేల్, కామారెడ్డిలో ఓడిపోతానని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతో కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి ఆరోపించారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను ప్రజల్లో బద్నామ్ చేయడానికి పత్రికల్లో నిత్యం 'రక్త చరిత్ర' పేరిట ప్రకటనలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఇదే క్రమంలో మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలోనూ కేసీఆర్, హరీశ్‌రావులు కోడి కత్తి దాడి చేయించుకుని... దానిని కాంగ్రెస్‌పై నెట్టేయాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. దాడి తర్వాత తన ఇంటిపై బీఆర్ఎస్ కార్యకర్తలను ఉసిగొలిపే ప్రమాదం ఉందన్నారు. దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని కాంగ్రెస్‌పై నెట్టే ప్రయత్నం చేసి ప్రజలను నమ్మించడంలో విఫలమయ్యారని తెలిపారు.

సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమం

మునిపల్లి(అందోల్): సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమం సాధ్యమవుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ అన్నారు. సోమవారం జోగిపేటలో అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు వెళ్తున్న సందర్భంగా సాయికుమార్ మాట్లాడారు. క్రాంతికిరణ్‌ను రెండోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, శశికుమార్, ఆనంద్, భాస్కర్, నవాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు



మాజీ కౌన్సిలర్ రొట్టెల రాందాస్ వాహనంలో లభ్యమైన మద్యం బాటిళ్లు

గజ్వేల్‌రూరల్: వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం కాటన్లను ఎన్నికల పర్యవేక్షణ నిఘా అధికారులు పట్టుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో ఎన్నికల నిఘా అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళికి చెందిన వాహనంలో నాలుగు కాటన్ల బీర్లు, మూడు కాటన్ల బ్లెండర్స్ ప్రైడ్ మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని తెలిపారు. అదేవిధంగా ఆదివారం రాత్రి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రొట్టెల రాందాస్‌కు చెందిన వాహనంలో సైతం పదమూడు కాటన్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ





ఆలయంలో వెలిగించిన దీపాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు సహస్ర దీపాలంకరణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖమండపంలో శివలింగం, స్వస్తిక్, ఓం ఆకారాలలో దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలాజీ, ఏఈఓ వైరాగ్యం అంజయ్య, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.